క్లుప్తంగా

నేడు గురుసంక్రమణ పూజలు

నగరి: స్థానిక కరకంతేశ్వర స్వామి ఆలయంలో గురుసంక్రమణ పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. గురుసంక్రమణ కారణంగా మేషం, కుంభం, మకరం, వృశ్చికం, కన్య, కటకం, వృషభం రాశుల వారు పరిహారం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే మీనం, ధనస్సు, తులా, సింహం, మిథునం రాశుల వారికి శుభమని తెలిపారు. పరిహార పూజల్లో భాగంగా శ్రీ మేథా దక్షిణామూర్తులకు అభిషేకం, అర్చన, హారతి పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తాగునీటి పైపులైను పనులు ప్రారంభం



పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ గుణశేఖర్

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీలోని 1వ వార్డుకు చెందిన మిట్టపల్లూరు గ్రామంలో శనివారం తాగునీటి పైపులైన్ల పనులను కౌన్సిలర్ సి.గుణశేఖర్ ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. మిట్టపల్లూరు శ్మశానవాటిక నుంచి గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వరకు పైపులైను ఏర్పాటు చేస్తున్నారు. నీటి సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు మంత్రి ఆర్‌కే రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

అంజేరయ్యకు నివాళి



అంజేరయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

వడమాలపేట: మండలంలోని ఎల్‌ఎమ్ కండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన అంజేరయ్య శుక్రవారం జరిగిన ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. విషయం తెలిసి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి శనివారం ఉదయం గ్రామానికి విచ్చేసి అంజేరయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నబ్బ, సురేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలి

తిరుపతి కల్చరల్: జిల్లాలోని రెండు సహకార చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి చెరుకు రైతులను ఆదుకోవాలని నేతాజీ రైతుల సంఘం అధ్యక్షుడు బి.నారాయణస్వామిరెడ్డి కోరారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో నాలుగు ప్రైవేటు, రెండు సహకార చక్కెర ఫ్యాక్టరీలు ఉండేవని తెలిపారు. వాటి సామర్థ్యానికి మించి రైతులు చెరుకు పండించి సరఫరా చేసేవారని తెలిపారు. ప్రస్తుతం ఒక ప్రైవేటు కర్మాగారం తప్ప మిగిలినవి మూతపడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. టన్ను చెరుకుకు రూ.3500 చెల్లించాల్సి ఉన్నా ఏజెంట్లు రూ.2100లు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. కూలీ, రవాణా ఖర్చులు పోను రైతులకు కనీసం రూ.500 కూడా మిగిలడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి జిల్లాలోని సహకార రంగంలోని చక్కెర కర్మాగారాలను తెరిపించి చెరుకు రైతులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ: చేతి వృత్తులను నేర్చుకుంటే మహిళలు కుటుంబానికి ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉండవచ్చని జనశిక్షణ్ సంస్థాన్ పీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పార్లపల్లెలో జనశిక్షణ్ సంస్థాన్ (తిరుపతి) మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించింది. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు అనుభవజ్ఞులైన వారితో టైలరింగ్‌తోపాటు పెయింటింగ్, ఎంబ్రాయిడరీ ఇత్యాది వాటిపై శిక్షణ ఇస్తామని, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేకం

పిచ్చాటూరు: నాగాలమ్మ గుడి కుంభాభిషేకం శనివారం వేడుకగా ప్రారంభమైంది. ఉదయం గణపతి పూజ, వాస్తు శాంతి, వాస్తు హోమం, ఆలయ శుద్ధి, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన కార్యక్రమాలు అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం గోపూజ, యాగశాల పూజ, అంకురార్పణం, కలశపూజ తదితర కార్యక్రమాలు చేశారు. కుంకుమార్చనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు నవగ్ర మండపంలో నవగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రదక్షిణం, మహా కుంభాభిషేకం అనంతరం అలంకారం, మహా హారతి ఉంటుందని, అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం పాట కచేరీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

త్యాగ నిరతికి ప్రతీక రంజాన్

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పేదలకు దానధర్మాలు చేసిన ముస్లింలు



పుత్తూరు ఈద్గా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నగరి: త్యాగనిరతికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగ వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే మసీదుల వద్ద కోలాహలం కనిపించింది. ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక జామియా, మక్కా మసీదులో అధిక సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు వెలుపల ఒకరినొకరు ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. మసీదు ఆవరణలో రద్దీ ఏర్పడడంతో పోలీసులు వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. అలాగే మసీదుల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. ముస్లింలు మధ్యాహ్నం తమ నివాసాల సమీపంలో ఉన్నవారికి విందు భోజనం పెట్టారు. మండలంలోని మీరాసాహెబ్ పాళెం, వేలావడి తదితర గ్రామాల్లో రంజాన్ సందడి కనిపించింది.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: పట్టణంలో రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలతో నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షను చేపట్టిన ముస్లింలు చివరి అంకంగా స్థానిక ఈద్గా మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు సామూహిక నమాజ్ చేశారు. పట్టణంలోని ఐదు మసీదుల్లో నమాజ్ అనంతరం కరచాలనం, ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

వడమాలపేటలో

వడమాలపేట: మండలంలోని పూడి సచివాలయం సమీపంలో ఇటీవల మంత్రి ఆర్కే రోజా టారిట బుల్ ట్రస్టు ద్వారా నూతనంగా నిర్మించిన ఈద్గాలో, వడమాలపేట మసీదులో ముస్లింలు రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల వద్ద పండుగ వాతావరణం కనిపించింది.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలవ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్ష విరమించారు. అబ్బాస్ కాలనీ, బాలగంనపల్లి, ఆవలకొండ, వీరకనెల్లూరు, వేల్కూరు గ్రామాల్లో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే పేదలకు అన్నదానం చేశారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి ముస్లింలకు రంజాన్‌తోఫా అందించడంతో జీడీనెల్లూరు మండలం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: దాన ధర్మాలకు ప్రతీకగా పిలిచే రంజాన్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం పేదలకు దాన, ధర్మాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: త్యాగానికి ప్రతీక రంజాన్ అని ముస్లింలు తెలిపారు. మండల పరిధిలోని రాచపాళెం మసీదులో ముస్లింలు రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్ని మసీదుల వద్ద పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా మతపెద్ద ఖైరుల్లా మాట్లాడుతూ పూర్వీకులు చేసిన త్యాగ ఫలితాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ త్యాగం, సహనం, పరోపకారం, దైవంపై విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు.

పెనుమూరులో..

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగను పెనుమూరు మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. పెనుమూరులోని నూరస్‌మసీదు నుంచి ర్యాలీగా గ్రామ సమీపంలోని నారమాకుల బైలు సమీపంలోని ఈద్గాకు చేరుకున్నారు. అక్కడ ప్రార్థనలు చేశారు. మసీదుల వద్ద పేదలకు అన్నదానం చేశారు. అలాగే పూనేపల్లి గ్రామంలోని ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించి ఖురాన్‌పఠించారు. కార్యక్రమంలో నూరస్ మసీదు ముత్తవల్లీ రఫీ, కోఆప్షన్ మెంబర్లు అమీన్, మురాద్‌ఖాన్ పాల్గొన్నారు.



వెదురుకుప్పం: వేపేరిలో..

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని ఏపేరి, తాటిమాకుపల్లె, పచ్చికాపల్లం గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేపేరి మసీదులో ముతవల్లీ హుస్సేన్ సాహేబ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి ఇటీవల ముస్లింలకు రంజాన్ తోఫా అందజేసిన సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ గఫూర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నింద్రలో..

నింద్ర: మండలవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలకేంద్రంలోని మసీదుతో పాటు పాదిరి గ్రామంలో ఉన్న మసీదులో ముస్లింలు రంజాన్ ప్రార్థనలు చేశారు. త్యాగనిరతికి ప్రతీకగా నిలిచే రంజాన్ సందర్భంగా నింద్ర సర్పంచ్ వసంతబాబురెడ్డి మసీదు అభివృద్ధి కోసం రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ముస్లింలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా మహిళా కార్యదర్శి మేరి, సచివాలయ కన్వీనర్లు కుప్పరాజు, శివలింగ ఆచారి, మహమ్మద్, నజీర్, ఆదంబాష పాల్గొన్నారు.









నగరి: జామిమా మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు, నగరి: ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న ముస్లింలు, వడమాలపేట: పూడి ఈద్గా మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు, పెనుమూరులో..









బాలగంనపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, కార్వేటినగరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, పాలసముద్రంలో, నింద్ర మసీదు అభివృద్ధికి ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్ వసంతబాబురెడ్డి

ఓంశక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పొంగళ్లు తీసుకొస్తున్న మహిళలు

పాలసముద్రం: మండలంలోని నిశింకాపురం గ్రామంలో వెలసిన ఓంశక్తి ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం గురుస్వామి అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి ఓంశక్తి భక్తులు పంబవాయిద్యాలతో కొత్త కుండల్లో పొంగళ్లు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి మూడుసార్లు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని వివిధ సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు పంచామృతం, తీర్థప్రసాదాలు అందించారు.

ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత



గోవర్ధనాదీశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శివప్రకాష్

పాలసముద్రం: ఆలయాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చేయూత అందిస్తోందని గోవర్ధనాదీశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు తెలిపారు. శనివారం సింహరాజుపురం పంచాయతీ మఠవలం గ్రామంలోని శ్రీకృష్ణ దేవరాయల హయాంలో నిర్మితమైన అతి పురాతనమైన గోవర్ధనాదీశ్వర ఆలయ మరమ్మతు పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆలయాల మరమ్మతులకు ఎన్నడూ లేనివిధంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. గోవర్ధనాదీశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఆలయ పనులను నాణ్యతగా చేపట్టాలని, అలాగే త్వరగా పనులు పూర్తి చేసి ఆలయ పునః ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

‘భాను..కాస్త అప్‌డేట్ అవ్వు..’



పుత్తూరు జగనన్న కాలనీలో ఇళ్లను చూపుతూ సెల్ఫీ దిగిన మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: అయ్యా గాలి భానుప్రకాష్.. మీకు మా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా..! ఇంకా పాతకాలం నాటి మాటలు చెప్తే ఎలా ? కాస్త అప్‌డేట్ అవ్వు నాయనా’ అంటూ పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి సూచించారు. శనివారం ఆయన పుత్తూరులోని జగనన్న హౌసింగ్ కాలనీ నుంచి సెల్ఫీ దిగి నగరి టీడీపీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్‌కు కౌంటర్ ఇచ్చారు. ‘‘చంద్రబాబు 9 ఏళ్ల పాలనలో టిడ్కో ఇళ్ల పేరిట పేద ప్రజల నుంచి లక్షలకు లక్షలు వసూలు చేసి వాటిని పూర్తి చేయకుండా వదిలేశారు. లక్షలు చెల్లించిన పేదలు నిరుపేదలయ్యారు. అయితే మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలో ఒక్క పుత్తూరులోనే రూ.31.68 కోట్లతో 1,634 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఇందులో ఇప్పటికే 568 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. నగరి నియోజకవర్గం మొత్తం మీద రూ.136.43 కోట్లతో 7,640 ఇళ్ల నిర్మాణాలు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పైగా మా సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొంది ఆనందంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా రాష్ట్ర ప్రజలు జగనన్నకు బ్రహ్మరథం పట్టనున్నారు. నగరి ప్రజలు మంత్రి రోజమ్మకు జేజే పలుకుతున్నారు. ఇవేవీ మీకు కనిపించడం లేదు.. వినిపించడం లేదు.. ఇలా అయితే ఎలా? కాస్త అప్డేట్ అవ్వండయ్యా’’ అంటూ హితవు పలికారు.

మట్టి జీవన తాత్వికతను తెలిపే కుమ్మరి కథలు

తిరుపతి కల్చరల్: మట్టి జీవన తాత్వికతను తెలిపిన కథలు కుమ్మరి కథలు అని ప్రముఖ రచయిత రాసాని తెలిపారు. ప్రముఖ రచయిత మూరిశెట్టి గోవిందు రాసిన కుమ్మరి కథలు పుస్తకాన్ని శనివారం సాయంత్రం యూత్ హాస్టల్లో అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి, చిత్తూరు జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాసాని మాట్లాడుతూ 90 దశకంలో మొదలైన ప్రపంచీకరణతో కులవృత్తులు తీవ్ర సంక్షోభానికి గురయ్యాయని తెలిపారు. ఛిద్రమవుతున్న కుమ్మరుల జీవన చిత్రాన్ని రచయిత గోవిందు ఆవిష్కరించారని పేర్కొన్నారు. శతావధాని ఆముదాల మురళి, అరసం నేత సాకం నాగరాజు, అధికార భాషా సంఘం సభ్యురాలు మస్తానమ్మ, కులవృత్తుల సంఘాల నేతలు అక్కినపల్లి లక్ష్మయ్య, బీవీ.కేశవులు, రుద్రకోటి సదాశివం, అరసం తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు గంటా మోహన్, యువశ్రీ మురళి, కులవృత్తుల యదార్థ జీవితవ్యధార్థ గాథల్ని ప్రస్తావిస్తూ రేపటి సమాజం శ్రమజీవుల సమాజం బహుజనుల సమాజమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రచయితలు కలువగుంట రామమూర్తి, నెమిలేటి కిట్టన్న, పళ్లిపట్టు నాగరాజు, నీలకంఠం, పేరూరు బాలసుబ్రమణ్యం, అమరేంద్ర, ఆర్‌సీ.రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి రామానుజాచార్యుల అవతారోత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 25 వరకు అన్నమాచార్య కళామందిరంలో రామానుజాచార్యుల అవతారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భగవత్ రామానుజాచార్యులపై సాహితీ సదస్సు, సంగీత కార్యక్రమాలు ఉంటాయి. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్దజీయంగార్, చిన్నజీయంగార్ అనుగ్రహభాషణంతో అవతారోత్సవాలు ప్రారంభమవుతాయి.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న చిద్విలాసం



చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకన్న శనివారం శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు తిరుచ్చిని అధిరోహించి ఆలయ మాడవీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న వెంకన్న గ్రామోత్సవం



అప్పలాయగుంట పురవీధుల్లో కటాక్షిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

వడమాలపేట: అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి గ్రామోత్సవం, ఊంజల్‌సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని స్వర్ణాభరణాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య శ్రీవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మంగళవాయిద్యాలు నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు సర్వదర్శనానికి అనుమతించారు. అక్షయ తృతీయ, రెండు రోజుల పాటు సెలవులు రావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. రాత్రి స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, షరాబు రామకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని మొరవ గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ సమేత ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో ఈ నెల 27 నుంచి మహాభారత మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ భాగవతారి రత్నకుమారిచే హరికథా కాలక్షేపం, రాత్రి శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన జరుగుందన్నారు. 27న ధ్వజారోహణం, 28, 29 యజ్ఞం, అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, 30న బండికుంభాలు, మే 1న ద్రౌపదీ కల్యాణం, 2న ద్రౌపదీ మానసంరక్షణ, 3న అర్జున తపస్సు, 4న యజ్ఞం, పూజ, 5న ఉత్తరగోగ్రహణం, 6న ఇలావంతుని వధ, 7న దుర్యోధన వధ, ధర్మరాజుల పట్టాభిషేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

వరించి..

- పంట కోతలకు రైతన్నలు సిద్ధం
- కర్షకులకు అండగా నిలిచిన ఆర్‌బీకే సిబ్బంది
- సత్ఫలితాలు ఇచ్చిన పొలంబడి కార్యక్రమం
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఆశించిన మేర లాభం వస్తుందని గంపెడాశలతో అన్నదాతలు



అరుగాలం కష్టపడే అన్నదాత పంట పండించడానికి పడే బాధలు అన్నీఇన్నీ కావు. పంట సాగు దగ్గర నుంచి కోతల వరకు, తరువాత ధాన్యాన్ని కల్లానికి చేర్చే వరకు ఎన్నో వ్యయ ప్రయాసలు పడతారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి పెద్దపీట వేసింది. రైతులు పంట సాగు మొదలు పెట్టే దగ్గర నుంచి ధాన్యం అమ్ముకునే వరకు ఆర్బీకే సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తూ రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. దానికి వ్యవసాయ అధికారులు నిర్వహించిన పొలంబడి కార్యక్రమం కూడా రైతులకు ఉపయోగపడడంతో మంచి సత్ఫలితాలు వస్తున్నాయి.

శ్రీరంగరాజపురం: అరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట దిగుబడిపైనే కర్షకులు వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు ప్రకృతి కూడా సహరించడంతో పంట దిగుబడి బాగుంటుందని అంచనా వేస్తున్నారు. వరి సాగు ఆలస్యంగా చేసినా వర్షం సకాలంలో కురిసి నీరు సక్రమంగా అందడంతో వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. నియోజకవర్గంలో 4,510 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. 130–140 రోజులకు పంట చేతికి రావడానికి పట్టే సమయం. వరి పంటలో 1153 రకం, 1121 రకం ఎక్కువగా సాగు చేశారు.

అండగా నిలిచిన ఆర్‌బీకే సిబ్బంది..

ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం చేపట్టి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. అలాగే ఆర్‌బీకే సిబ్బంది సూచించిన నాణ్యమైన విత్తనాలు వినియోగించడంతో పాటు రసాయన మందుల వినియోగం కూడా తగ్గించారు. అంతేకాక ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వర్షాలకు, పెనుగాలులకు రైతులు కొంత ఆందోళన చెందినా, ఇప్పుడు పంట దిగుబడి బాగా వచ్చింది. వర్షాల సమయంలో అధికారుల సూచనలతో రైతులు పంట నష్టం నుంచి గట్టెక్కారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు..

నియోజకవర్గంలో గతవారం రోజులుగా వరికోతలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం కూడా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేసింది. రైతులకు అందుబాటులో ఉండేలా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గతేడాదిలానే ఈసారి కూడా ఎక్కువ మంది రైతులు వరి కోత యంత్రాలతోనే పంట కోతలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

శ్రీరంగరాజపురంలో కేంద్రం ఏర్పాటు..



వరి కొనుగోలు ఇప్పుడు ప్రారంభం అవుతున్నాయి. రైతులకు అందుబాటులో ఉండేవిధంగా శ్రీరంగరాజపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. రైతులకు అవసరమయ్యే ధాన్యం సంచులను కూడా సిద్ధం చేస్తున్నాం.

–చిట్టిబాబు, మండల వ్యవసాయధికారి

పంట ఆశాజనకంగా ఉంది..



నీరు పుష్కలంగా ఉండడంతో పాటు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిచండంతో పాటు ప్రతి ఎకరాకు నీరు అందించింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించగా పంట ఆశాజనకంగా వచ్చింది. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించడంతో పంటను కాపాడుకోగలిగాం. ప్రభుత్వ సాయం మరువలేనిది.

–రైతు చిన్నబ్బ, పెద్ద తయ్యూరు

గంగమ్మ ఆలయానికి కలశం బహూకరణ



కలశాన్ని అందజేస్తున్న దాత రాము ఆచారి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ గర్భాలయం విమాన గోపురానికి సంబంధించిన రాగి కలశాన్ని తిరుపతికి చెందిన రాము ఆచారి బహూకరించారు. అమ్మవారి గర్భాలయ విమాన గోపురం ప్రథమ కలశాన్ని శనివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష పరిశీలించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ విమాన గోపురంపై ప్రతిష్ఠించనున్న కలశానికి పూర్తిగా బంగారు తాపడం చేయించాలని సూచించారు. అలాగే మహా కుంభాభిషేకం పనులను ఆదివారం నుంచి ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. అనంతరం కలశాన్ని బహూకరించిన దాత రాము ఆచారిని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.